సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్ బుధవారం ఆవిష్కరించారు.



బాలికల రక్షణకు ప్రత్యేక చట్టాలు

సిరిసిల్లటౌన్: బాలికల పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ పేర్కొన్నారు. అంబేడ్కర్‌నగర్ హైస్కూల్‌లో మాట్లాడారు.

గరిష్టం/కనిష్టం
32.0/19.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పదవులు కాదు.. పనులు గుర్తుండిపోతాయి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



సర్పంచులకు సన్మానం

వేములవాడరూరల్: ఐదేళ్లుగా సర్పంచులు గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషిచేశారని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. వేములవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బండ మల్లేశం అధ్యక్షతన బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడారు. పదవీకాలంలో చేసిన పనులే గుర్తుండిపోతాయన్నారు. చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి మంజూరుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎంపీపీ బండ మల్లేశం మాట్లాడుతూ వైద్యాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అనంతరం సర్పంచులను సన్మానించారు. తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో రమేశ్, వైస్‌ఎంపీపీ జక్కుల కవిత, ఎంపీటీసీలు చెన్నాడి శ్యామల, వెలుమ నర్సవ్వ, తిరుపతి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, సూపర్‌వైజర్ నిర్మలాదేవి, డాక్టర్ ప్రశాంత్, ఏఈ పవనకుమారి, ఏవో సాయికిరణ్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పదిలో వంద శాతం ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాధికారి రమేశ్



మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

ముస్తాబాద్(సిరిసిల్ల): పదోతరగతిలో నూరు శాతం ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ కోరారు. ముస్తాబాద్‌లో జెడ్పీ ఉన్నత బాలికలు, బాలురు, నామాపూర్‌లో మోడల్‌స్కూల్‌లో పదోతరగతి విద్యార్థులతో బుధవారం మాట్లాడారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈసందర్భంగా ముస్తాబాద్‌లో పదోతరగతి విద్యార్థులకు డీఈవో ఫిజిక్స్ పాఠం బోధించారు. పదోతరగతి పరీక్షా కేంద్రాలు, ఫర్నీచర్, ఉద్యోగుల ఎంపికపై నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డితో చర్చించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్‌ఎంలు రాజిరెడ్డి, రవీందర్, ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, ఉద్యోగులు రాజేందర్ ఉన్నారు.

గంజాయిపై గట్టి నిఘా

- సిరిసిల్లలో ఆకస్మిక తనిఖీలు
- ఎస్పీ అఖిల్ మహాజన్



తనిఖీల్లో సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి


సిరిసిల్లక్రైం: జిల్లా మత్తు పదార్థాలు, గంజాయి నిల్వలు, విక్రయాలపై నిఘా పెట్టినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. సిరిసిల్లలో బుధవారం పోలీసులు నాలుగు బృందాలుగా దాడులు చేశారు. నిషేధిత గుట్కాలు, పాన్‌లో వివిధ రకాల రసాయనాలు వాడరాదని హెచ్చరించారు. గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు నిరంతరం తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. గంజాయి సమాచారం ఉంటే 63039 22572 నంబర్‌కు తెలపాలని కోరారు.

కార్యదర్శుల ఘర్షణపై డీపీవో షోకాజ్ నోటీస్‌లు

బోయినపల్లి(చొప్పదండి): మండలానికి చెందిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు ఎంపీవో ఎదుట ఘర్షణపడ్డ సంఘటనలో డీపీవో రవీందర్ వారిద్దరితోపాటు ఎంపీఓకు రెండు రోజుల క్రితం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఈ నెల 12న మర్లపేట ప్రజాపాలన డాటా ఎంట్రీ అంశంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మణ్, శేఖర్ గొడవ పడ్డ విషయం తెలిసిందే. ఈ గొడవ ఠాణా వరకు వెళ్లింది. వేములవాడరూరల్ సీఐ కృష్ణకుమార్ సైతం గొడవపై ఆరా తీశారు. నివేదిక డీపీవోకు అందడంతో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులతోపాటు ఎంపీవోకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా, వారికి అందించినట్లు ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి తెలిపారు.

ఆశల రైలు పట్టాలెక్కేనా..!

కొత్తపల్లి-మనోహరాబాద్ లైన్‌కు రూ.850 కోట్లు అవసరం



- రామగుండం- మణుగూరు మార్గంపై గంపెడాశలు
- నిజామాబాద్- పెద్దపల్లి డబ్లింగ్‌కు కలగాలి మోక్షం
- నెరవేరని తిరుపతి రైలు అదనపు సర్వీసుల హామీ
- బసంత్‌నగర్ విమానాశ్రయంపై కరుణచూపాలి
- లైన్లు సిద్ధమైనా అందుబాటులోకి రాని 'వందేభారత్'
- నేడు కేంద్ర రైల్వే బడ్జెట్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులకు ఈసారైనా పూర్తిస్థాయిలో కేటాయింపులు దక్కుతాయా..? పెండింగ్ ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో నిధులు అందుతాయా..? లేక ఎప్పటిలాగానే మళ్లీ ఎదురుచూపులేనా..? అనే ప్రశ్నలకు నేడు సమాధానం దొరకనుంది. ఉమ్మడి జిల్లాలో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రాష్ట్ర రాజధాని ప్రయాణం కోసం ప్రారంభించిన కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ నిధుల కటకట, భూసేకరణ సమస్యలు ఎదుర్కొంటోంది. రామగుండం-మణుగూరుకు గత బడ్జెట్‌లో కేవలం రూ.10 కోట్లే ఇచ్చారు. నిజామాబాద్- పెద్దపల్లి డబ్లింగ్ పనులకు ఈసారైనా చోటు దక్కాలని, ఉమ్మడి జిల్లా వాసులకు తిరుపతి రైలును వారానికి నాలుగు సార్లు అందుబాటులోకి తీసుకురావాలని ఉమ్మడి జిల్లావాసులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

కొత్తపల్లి-మనోహరాబాద్

హైదరాబాద్‌ను కరీంనగర్‌తో అనుసంధానించేందుకు రూపొందించిన రైల్వేలైన్ ఇది. 2016–17లో రూ.1,167 అంచనావ్యయంతో ప్రారంభించారు. ఇప్పటివరకు మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు లైన్ పూర్తయి రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక సిద్దిపేట - సిరిసిల్ల మార్గంలో రూ.440 కోట్ల అంచనాతో పనులు మొదలుపెట్టినా.. ఇక్కడ భూసేకరణపై చిక్కులు తలెత్తాయి. రైతులు తమకు చెల్లించాల్సిన పరిహారం కోసం భీష్మించడం.. ప్రభుత్వం కూడా తాను చెల్లించాల్సిన రూ.19 కోట్లలో జాప్యం చేయడంతో పనులు సందిగ్ధంలో పడ్డాయి. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది మార్చిలో సిరిసిల్ల వరకు లైన్ వేయాలి. వచ్చే ఏడాది జూన్‌వరకు ప్రాజెక్టు పూర్తవ్వాలి. ఇవన్నీ కావాలంటే సిరిసిల్ల నుంచి కొత్తపల్లి వరకు మొత్తం రూ.850 కోట్లు అవసరం అవుతాయని దక్షిణ మధ్య రైల్వే అంచనా వేస్తోంది.

రామగుండం- మణుగూరు

గత బడ్జెట్‌లో రామగుండం (రాఘవాపూర్)-మణుగూరు రైల్వేలైన్‌కు కేవలం రూ.10 కోట్లే కేటాయించారు. ఏడాది కింద ప్రధాని నరేంద్ర మోదీ రామగుండం వచ్చినపుడు పనులకు శంకుస్థాపన చేశారు. 2023 బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు అంచనా విలువ రూ.3000 కోట్లు. రాఘవాపురం నుంచి మొదలయ్యే ఈ లైన్ మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాల్‌రావుపేట ప్రాంతాలమీదుగా మణుగూరు చేరుతుంది. ప్రస్తుతం వరంగల్-డోర్నకల్ మీదుగా మణుగూరు చేరాలంటే దాదాపు 290 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ఈ దూరం 200 కిలోమీటర్లకు తగ్గుతుంది.

తిరుపతికి అదనపు సర్వీసులు..?

కరీంనగర్ నుంచి తిరుపతికి వెళ్లే తిరుపతి సూపర్ ఫాస్ట్ (12762) ఎక్స్‌ప్రెస్‌కు ఉమ్మడి జిల్లావాసుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉంది. సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్‌తోపాటు మంచిర్యాల జిల్లా వాసులకు కూడా ఇది అందుబాటులో ఉంది. వారానికి రెండు సర్వీసులు మాత్రమే ఉండటంతో రద్దీ తట్టుకోలేకపోతున్నారు. ఇటీవల ఎంపీ బండి సంజయ్ దీన్ని వారానికి నాలుగుసార్లు నడుపుతామని ప్రకటించినా అది అమలులోకి రాలేదు. ఈ బడ్జెట్‌లోనైనా శుభవార్త వినాలని భక్తులు కోరుకుంటున్నారు.

ఈ రైళ్లు ఆగేనా..?

ఉమ్మడి జిల్లాలో ప్రధాన రైల్వేకేంద్రం రామగుండంలో పలు రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. చెన్నై నుంచి అహ్మదాబాద్ వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం నుంచి నిజాముద్దీన్ వెళ్లే స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి-నిజాముద్దీన్ వెళ్లే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, ఎర్నాకులం నుంచి నిజాముద్దీన్ వెళ్లే మిలీనియం ఎక్స్‌ప్రెస్‌ల అప్‌అండ్ డౌన్‌కు రామగుండంలో హాల్టింగ్ అవకాశం ఇస్తే ప్రజారవాణా మెరుగయ్యే అవకాశాలున్నాయి.

బసంత్‌నగర్ విమానాశ్రయం



ఉమ్మడి జిల్లా రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చే ప్రాజెక్టు ఇది. చిన్న విమానాశ్రయాలను అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన ఉడాన్ 5.0 ప్రాజెక్టులో రాష్ట్రం నుంచి వరంగల్, బసంత్‌నగర్ విమానాశ్రయాలు ఎంపికయ్యాయి. వరంగల్ విమానాశ్రయం పనుల్లో కాస్తోకూస్తో పురోగతి కనిపిస్తున్నా.. బసంత్‌నగర్ విషయంలో మాత్రం ఇంకా ఎలాంటి సంకేతాలు రావడం లేదు. ఈసారైనా ప్రకటన వస్తుందని ఉమ్మడి జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు.

సింగరేణి కార్మికులకు తీపికబురు అందేనా..!



రాష్ట్రవ్యాప్తంగా 11 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉన్న సింగరేణి కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఆదాయ పన్ను తగ్గింపు లేదా రద్దు కోసం డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో బీజేపీ సర్కారు సింగరేణివ్యాప్తంగా ఉన్న 48వేలమంది కార్మికుల డిమాండ్‌పై సానుకూల ప్రకటన వస్తుందని కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఈ డిమాండ్లు కూడా..

- కరీంనగర్, రామగుండం, పెద్దపల్లి రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ కోసం అమృత్‌భారత్ పథకం కింద ఒక్కో స్టేషన్‌కు రూ.20 కోట్లు కేటాయించింది. ఈ పనులు మందకొడిగా సాగుతున్నాయన్న విమర్శలున్నాయి.
- నిజామాబాద్- పెద్దపల్లి మార్గంలో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని డబ్లింగ్ మార్గంగా అప్‌గ్రేడ్ చేయాలని దశాబ్దాల నుంచి ప్రజలు కోరుతున్నారు. - ఉమ్మడి జిల్లాలో రైల్వే ట్రాకులన్నీ వందేభారత్ కోసం సామర్థ్యం 90 కిలోమీటర్ల నుంచి 130 కిలోమీటర్లకు పెంచారు. ఇంతవరకూ ఉమ్మడి జిల్లా వాసులకు వందేభారత్ సర్వీసులు అందుబాటులోకి రాలేదు.
- కరీంనగర్-హసన్‌పర్తి రోడ్ లైన్ కోసం ఇటీవల దక్షిణ మధ్య రైల్వే ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) కోసం రూ.5 కోట్లు కేటాయించింది. ఈ లైన్ అంచనా వ్యయం రూ.1162 కోట్ల వరకు ఉండొచ్చు.

బీడీకార్మికుల ఆస్పత్రి నిర్మిస్తారా?



వేములవాడ శివారులో స్కూల్ బిల్డింగ్‌లో బీడీ కార్మికుల ఆస్పత్రి

సిరిసిల్ల: రాష్ట్రంలోనే ఏకైక బీడీ కార్మికుల వైద్యశాల సిరిసిల్లలో ఉంది. 2012లో అప్పటి కేంద్రం బీడీకార్మిక సంక్షేమ ఆస్పత్రిని మంజూరు చేసింది. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి వద్ద 25 ఎకరాలు కేటాయించగా.. బడ్జెట్ లేక భవనం నిర్మించలేదు. నాంపల్లి వద్ద మిడ్‌మానేరు పునరావాస కాలనీలోని స్కూల్ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. 2012 నుంచి అరకొర వసతుల మధ్య కొనసాగుతోంది. ఊరికి దూరంగా ఉండడంతో కార్మికులు ఎవరూ రావడం లేదు. మరోవైపు పీఎఫ్ గల బీడీ కార్మికులకు రిటైర్డుమెంట్ తరువాత ఇచ్చే పెన్షన్ లోపభూయిష్టంగా ఉంది. ఒక్కో కార్మికురాలికి రూ.250 నుంచి రూ.900 వరకు ఉంటుంది. అంటే రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్ కంటే తక్కువగా వస్తుంది.

- యశ్వంత్‌పూర్- గోరఖ్‌పూర్ రైలుకు జమ్మికుంటలో హాల్టింగ్ ఇవ్వడంతో ఉమ్మడిజిల్లావాసులు సంబరాలు చేసుకున్నారు. వాస్తవానికి ఈ రైలుకు పెద్దపల్లిలో కూడా హాల్టింగ్ కల్పిస్తే పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్ వాసులకు ఉపయుక్తంగా ఉంటుంది.

ఆదాయ పన్ను పరిమితి పెంచాలి



ప్రస్తుతం ఆదాయం రూ.10 లక్షలు దాటితే.. 30 శాతం పన్ను విధిస్తున్నారు. దీన్ని తగ్గిస్తే చాలా మంది ఆదాయాన్ని ఎక్కువగా చూపించి పన్నులు చెల్లిస్తారు. జీఎస్టీ పరిధి అన్ని రాష్ట్రాల్లో ఒకేలా ఉండేలా చూడాలి. మన రాష్ట్రంలో రూ.20లక్షలు ఉండగా.. కొన్ని రాష్ట్రాల్లో రూ.40 లక్షలు ఉంది. దీన్ని సవరించాలి.

– జిందం రమేశ్, ట్యాక్స్ కన్సల్టెంట్, సిరిసిల్ల

రైల్వేలైన్‌కు నిధులివ్వాలి



సిరిసిల్ల, వేములవాడలకు రైలుమార్గం పూర్తయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ప్రధాని మోదీ మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ రైల్వేలైన్ నిర్మాణానికి ఎక్కువ నిధులు కేటాయిస్తే రైలు కొత్తపల్లి వరకు చేరుతుంది. పారిశ్రామికంగా సిరిసిల్ల అభివృద్ధి చెందుతుంది.

– చింతోజు భాస్కర్, మానేరు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు

బీడీ కార్మికుల ఆస్పత్రిని నిర్మించాలి



బీడీ కార్మికుల ఆస్పత్రిలో డాక్టర్ ఉంటే.. సిబ్బంది ఉండరు.. సిబ్బంది ఉంటే.. డాక్టర్ ఉండరు. బీడీ కార్మికులు కూడా అటువైపు వెళ్లడం లేదు. బద్దెనపల్లి వద్ద కేటాయించిన స్థలంలో 50 పడకలతో కూడిన బీడీ కార్మికుల ఆస్పత్రికి నిధులు కేటాయించి భవనం అందుబాటులోకి తేవాలి.

– వెంగళ శ్రీనివాస్, బీడీ కార్మిక నాయకుడు

పీఎఫ్ పెన్షన్ పెంచాలి



పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులు రాజీనామా చేస్తే ప్రావిడెంట్ డబ్బులు చాలా తక్కువగా వస్తున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా బీడీ కార్మికులకు ఇచ్చే పెన్షన్‌ను పెంచాలి. జిల్లాలో 25 వేల మంది బీడీ కార్మికులు ఉన్నారు. పీఎఫ్ విధానాన్ని మార్చాలి. ఆస్పత్రి నిర్మాణానికి నిధులు కేటాయించాలి.

– యశ్వాద పద్మ, బీడీ కార్మికురాలు

కోడెల అక్రమ తరలింపుపై విచారణ

- ఆలయ ఉద్యోగుల నుంచి వివరాలు సేకరణ
- రెండు రోజుల క్రితమే వచ్చిన స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసులు
- ఆలస్యంగా వెలుగులోకి..
- భయాందోళనలో రాజన్న ఆలయ ఉద్యోగులు



వేములవాడఅర్బన్: రాజన్న కోడెల తరలింపు విషయంపై రెండు రోజుల క్రితం స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసులు ఆలయానికి విచారణకు వచ్చినట్లు తెలిసింది. ఆలయ గోశాలలకు వెళ్లి రికార్డుల్లోని వివరాలు, ఉద్యోగుల నుంచి సమాచారం సేకరించినట్లు తెలిసింది. గోశాలలోని కోడెల నిర్వహణకు సంబంధించిన ఉద్యోగుల వివరాలు అధికారికంగా తెలపాలని ఆలయ ఈవోకు సూచించినట్లు తెలిసింది. దీంతో ఆలయ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. రికార్డుల ప్రకారం అక్రమంగా నాలుగు కోడెల విషయంలో ఆలయ ఉద్యోగులపై కేసు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే ఒకరి వాంగ్మూలాన్ని పోలీసులు సేకరించినట్లు సమాచారం. ఈ కేసు ఆలయ ఉద్యోగుల మెడకు చుట్టుకునే ప్రమాదం ఉందనే భయాందోళనలు మొదలయ్యాయి.

అసలేం జరిగింది?

దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులు కోడెమొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. భక్తులు తమ వద్ద ఉన్న కోడెలను సైతం మొక్కు కింద రాజన్నకు అప్పగిస్తుంటారు. ఇలా ఆలయానికి వచ్చిన కోడెల సంరక్షణకు వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో గోశాల ఏర్పాటు చేశారు. ఆ కోడెలను తెలంగాణ గోశాల ఫెడరేషన్ ద్వారా ఇతర గోశాలలకు ఉచితంగా అందిస్తుంటారు. ఇందులో భాగంగా జనవరి 2న తిప్పాపూర్ గోశాలలోని 20 కోడెలను మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం దుబ్బాతండాలోని శ్రీసోమేశ్వర గోసంరక్షణ సేవా సంఘానికి అందించిన విషయం తెలిసిందే. ఈ కోడెల వ్యాన్‌లో 20 కోడెలకు బదులు 24 కనిపించడంతో జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ భజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని దుబ్బాతండాలో ఈ పేరు గల గోశాల లేదని నిర్ధారించుకొని వ్యాన్‌ను సీజ్ చేశారు. ఈ విషయంపై సాక్షిలో వరుస కథనాలు వచ్చాయి. ‘రాజన్న కోడెల పక్కదారి’, ‘కోడెల తరలింపుపై అనుమానాలు’ శీర్షికలతో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై పోలీస్ అధికారులు స్పందించారు. ఈమేరకు విచారణకు వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

రాజన్న ఆలయ అభివృద్ధికి నిధులు



వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, వీటీడీఏ అధికారులు తదితరులు సీఎంతో సమావేశమయ్యారు. రాజన్న ఆలయం, వేములవాడ పట్టణ అభివృద్ధిపై చర్చించారు.

- వివరాలు 8లో

ఉత్సాహంగా క్రీడాపోటీలు



సిరిసిల్లకల్చరల్: అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సారథ్యంలో బుధవారం నిర్వహించిన క్రీడాపోటీలు ఉల్లాస భరితంగా సాగాయి. రాజీవ్‌నగర్‌లోని మినీస్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో 8 నుంచి 14 ఏళ్లలోపు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రన్నింగ్ పోటీల్లోని విజేతలకు అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా చంద్రశేఖర్ చేతులమీదుగా బహుమతులు అందించారు. ప్రతిభ కనబరిచిన వారిని భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

నేడు పోలీస్ క్రికెట్ లీగ్ ఫైనల్

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న పోలీస్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ ఫైనల్ మ్యాచ్ గురువారం జరగనుంది. ఫైనల్‌లో డీజీ బ్రేవ్ సోల్జర్స్, సిరిసిల్ల స్ట్రైకర్స్ జట్లు తలపడనున్నాయి. బుధవారం నిర్వహించిన సెమీఫైనల్‌లో ఎంటీ ఈగల్స్, డీజీ బ్రేవ్ సోల్జర్స్ తలపడగా.. ఎంటీ ఈగల్స్ బ్యాటింగ్ చేసి నిర్ణీత 12 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన డీజీ బ్రేవ్ సోల్జర్స్ 9.1 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. అనంతరం సిరిసిల్ల స్ట్రైకర్స్, వేములవాడ రుద్రాస్ తలపడగా.. మొదట బ్యాటింగ్ చేసిన సిరిసిల్ల స్ట్రైకర్స్ నిర్ణీత 12 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన వేములవాడ రుద్రాస్ 12 ఓవర్లలో 104 పరుగులు చేసి ఓడిపోయింది.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలో ఓ కారు అదుపుతప్పి పెట్రోల్‌బంకులోకి చొచ్చుకెళ్లగా పిల్లర్‌ను తాకి ఆగడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సిరిసిల్ల పాతబస్టాండ్ ఏరియాలోని పెట్రోల్ బంకులోకి ఓ కారు వేగంగా వచ్చి పెట్రోల్‌బంకు మిషన్ ఉన్న షెడ్ పిల్లర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం దెబ్బతింది.

మత్తు పదార్థాలు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలకేంద్రంలో గంజాయి చాక్లెట్ల విక్రయాలపై ఎస్సై శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం తనిఖీలు చేపట్టారు. పాన్‌షాపులు, టీస్టాల్స్, కిరాణ దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్సై మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో గంజాయి కలిపిన చాక్లెట్ల విక్రయాలు వెలుగు చూడటంతో తనిఖీలు చేపట్టామన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏఎస్సై వెంకటరమణ, హెచ్‌సీలు బాల్‌నర్సయ్య, భూమయ్య పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో నిరసన



సిరిసిల్లటౌన్: ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయకుండా కేసీఆర్ కుట్ర పూరితంగా వ్యవహరించారని సీపీఐ, ఎంసీపీఐయూ, తెలంగాణ జన సమితి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో సారథ్యం వహించిన ప్రొఫెసర్ కోదండరాంను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి ఎమ్మెల్సీ పదవితో గౌరవిస్తే.. బీఆర్‌ఎస్ నాయకత్వం కోర్టులో కేసు వేసి అడ్డుకుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా బీఆర్‌ఎస్ చర్యలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు బొజ్జ కనకయ్య, గుంటి వేణు, పంతం రవి, సదానందం, కొట్టి రవి, రాములు, బాలచందర్ పాల్గొన్నారు.

మహిళల రక్షణే ధ్యేయం



వేములవాడఅర్బన్: మహిళల రక్షణే ప్రధాన ధ్యేయమని రాజన్నసిరిసిల్ల జిల్లా షీటీమ్ ఎస్సై ప్రమీల పేర్కొన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆకతాయిలతో ఇబ్బందులు ఎదుర్కొంటే నిర్భయంగా షీటీమ్‌ను సంప్రదించాలని కోరారు. ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, అధ్యాపకులు మధురాజేశ్, వెంకటేశ్వర్లు, అఫ్సారి ఉస్మాని, రమాదేవి, శ్రీనివాసులు, నర్సయ్య తదితరులు ఉన్నారు.

అవార్డు వచ్చింది.. ర్యాంకు తగ్గింది

- స్వచ్ఛ సర్వేక్షణ్‌-2023లో సిరిసిల్ల
- సౌతిండియాలో నాలుగో ర్యాంకు
- పరిశుభ్రత, అభివృద్ధికి దక్కిన గౌరవం

సిరిసిల్లటౌన్: స్వచ్ఛ సిరిసిల్ల జాతీయస్థాయిలో తన ఖ్యాతిని నిలబెట్టుకుంది. అయితే ఈసారి ర్యాంక్ తగ్గింది. గతేడాది రెండో స్థానం సాధించగా.. ఇప్పుడు నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. వరుసగా ఆరోసారి జాతీయ అవార్డులు సాధించింది. స్వచ్ఛ సిరిసిల్లగా నిలిచే క్రమంలో చేసిన పనులు, ర్యాంక్ సాధనలో తీసుకున్న నిర్ణయాలపై కథనం.

స్వచ్ఛమైన బాధ్యత

సిరిసిల్లలో బల్దియా వందశాతం స్వచ్ఛతను సాధించింది. ఎమ్మెల్యే కె.తారకరామారావు ఆదేశాలతో బల్దియా పాలకవర్గం, అధికారులు పరిశుభ్రత, అభివృద్ధి పనులు చేపట్టారు. మున్సిపల్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిషేధం అమలు చేయడంతోపాటు ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా కట్టుదిట్టం చేశారు. పట్టణంలో 21వేలకు పైగా నివాసాలుండగా నూరుశాతం మరుగుదొడ్లను నిర్మించుకునేలా చేసి ఓడీఎఫ్ పట్టణంగా, పబ్లిక్ టాయిలెట్స్ వినియోగం, ప్లాస్టిక్ నిషేధంతో ఓడిఎఫ్ ప్లస్ పట్టణంగా గుర్తింపు సాధించింది. చెత్త సేకరణలో ఇంటింటికీ రెండు చెత్తబుట్టలను అందించి అందులో ఒకటి తడి చెత్త, మరొకటి పొడిచెత్తను, ప్లాస్టిక్‌ను వేర్వేరుగా సేకరిస్తుంది. పట్టణంలో ఉత్పత్తి అయిన చెత్తతో వర్మీకంపోస్టు(ఎరువు) తయారు చేయడంలో సిరిసిల్ల బల్దియా ముందుంటోంది. మానవ వ్యర్థాలతో ఎరువు తయారీ.. స్వశక్తి గ్రూపులతో డ్రై రీసోర్స్ సెంటర్ నిర్వహిస్తూ ఈ ఏడాది రూ.లక్షల్లో ఆదాయం సాధిస్తుంది. పాఠశాలలు, హాస్పిటల్స్, వాణిజ్య, వ్యాపార సముదాయాలకు స్వచ్ఛ పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తూ.. ప్రజల్లో, పట్టణ పౌరుల్లో చెదరని స్ఫూర్తితో గతేడాది కీర్తిని జాతీయ స్థాయిలో మరోసారి రాణించింది.

మెరుగైన పారిశుధ్యం

- సిరిసిల్లలో మున్సిపల్ యాప్ ద్వారా పౌరులు నేరుగా పట్టణంలో పారిశుధ్యం, నీటిసరఫ రా, వీధి దీపాలు తదితర విషయాలపై ఫిర్యాదులు చేయగా ఎపటికప్పుడే పరిష్కరించారు.



ఎల్‌ఈడి వెలుగుల్లో సిరిసిల్ల అందాలు



సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం

- పట్టణంలోని అన్ని ఏరియాల్లో పేరుకుపోయిన సమస్యలను ఒక్క క్లిక్‌తో ఫొటో తీసి లేదా మెస్సె చేస్తే 24 24 గంటల్లోపు పరిష్కరిస్తున్నారు.
- పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణకు ప్రతీ వేయి మందికి ఒకటి చొప్పున లక్ష జనాభాకు 100 సీట్లు ఉండాల్సి ఉండగా.. 120 సీట్ల టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయి.
- మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్, ఫిర్యాదులకు క్యూర్ కోడ్, స్వచ్ఛసర్వేక్షన్ యాప్‌ల వినియోగం ఫలించింది. వార్డుల్లో సమస్యల పరిష్కారానికి నిర్వహించే యాప్, క్యూఆర్ కోడ్ విధానం తదితర అంశాలు కూడా స్వచ్ఛ పట్టణంగా సిరిసిల్లకు పేరు తీసుకురావడం విశేషం.

అవార్డుల పరంపర

మాజీ మంత్రి కేటీఆర్ చొరవ.. పాలకులు, అధికారుల ప్రత్యేక శ్రద్ధతో జిల్లా కేంద్రం సిరిసిల్ల వరుసగా స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల్లో అవార్డులు సాధిస్తుంది. గతేడాది లక్షలోపు జనాభా గల నగరాల్లో స్వచ్ఛ పట్టణంగా అవార్డు సాధించగా..అదే స్ఫూర్తి కొనసాగించింది. స్వచ్ఛ భారత్‌లో సిరిసిల్ల మున్సిపాలిటీ ఇప్పటి వరకు ఆరుసార్లు జాతీయ అవార్డులు, ఏడుసార్లు రాష్ట్రస్థాయి అవార్డులు పొందింది. అదే స్ఫూర్తితో సిరిసిల్ల బల్దియా ముందడుగు వేసింది. స్వచ్ఛసర్వేక్షణ్ 2018లో జరిగిన పోటీల్లో తొలిసారిగా పాల్గొన్న సిరిసిల్ల మున్సిపాలిటీ రీజినల్ స్థాయి (సౌతిండియా లెవెల్)లో లక్షలోపు జనాభా గల పట్టణాల విభాగంలో ఐదో ర్యాంకును సాధించింది. తర్వాతి క్రమంలో మొదటి స్థానం, ద్వితీయ స్థానం, ఇప్పుడు నాలుగోస్థానం సాధించింది. ఇప్పటికే రెండు జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డులను కైవసం చేసుకుంది.

ప్రజల సహకారంతో..



స్వచ్ఛసర్వేక్షణ్‌-23లో జాతీయ అవార్డు రావడంలో ప్రజల సహకారం, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రోత్సాహం అందించారు. పురపాలనలో పాలకవర్గం ఎనలేని కృషి చేసింది. గతేడాది అవార్డు సాధించిన స్ఫూర్తితో ముందుకెళ్లగా పోటీల్లో కొన్ని మార్పులతో నాలుగో ర్యాంకు వచ్చింది. కాగా పారిశుధ్యం నిర్వహణలో నూరుశాతం మార్కులు సాధించాం. పౌరుల సహకారంతో పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తున్నాం.

– ఎండీ అయాజ్, కమిషనర్, సిరిసిల్ల

రాజన్న ఆలయ అభివృద్ధికి నిధులు



సీఎం ఆధ్వర్యంలో సమావేశానికి హాజరైన పొన్నం, ఆది శ్రీనివాస్, కలెక్టర్ అనురాగ్ జయంతి

- ముఖ్యమంత్రి అధ్యక్షతన వీటీడీఏ సమావేశం
- వేములవాడ రాజన్న గుడి, పట్టణ అభివృద్ధిపై సమీక్ష

వేములవాడ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ సమావేశం సచివాలయంలో బుధవారం జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌తో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజన్న గుడి, భక్తుల సౌకర్యాలతో పాటు వేములవాడ పట్టణ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సీఎంకు వివరించారు. దేవస్థాన అభివృద్ధి, బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి నమూనాలు, పార్కింగ్ స్థలంలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు, శివార్చన మండప నిర్మాణాలపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా వీటీడీఏ వైస్ చైర్మన్ అనురాగ్ జయంతి ముఖ్యమంత్రికి వివరించారు.

నిధులు విడుదల

గతంలో రాజన్న ఆలయ అభివృద్ధికి హెచ్‌ఎండీఏ సాఫ్ట్‌లోన్ ద్వారా మంజూరై నిలిచిపోయిన రూ.20కోట్ల నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌ఎండీఏ సాఫ్ట్ లోన్ నిధుల ద్వారా జరుగుతున్న బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి, శివార్చన మండప నిర్మాణం, గుడి చెరువు సుందరీకరణ, నటరాజ విగ్రహ ఏర్పాటు, పార్కు పనుల్లో వేగం పెంచాలన్నారు. బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధితోపాటు పార్కింగ్ స్థలాల్లో టూరిజం శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేములవాడ పట్టణ ప్రజలతో పాటు రాజన్న భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తీర్చేలా వేములవాడ మూలవాగు బ్రిడ్జితో పాటు బ్రిడ్జి నుంచి 800 మీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలని సూచించారు. రోడ్డు విస్తరణతో పాటు మూలవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన రూ.35కోట్ల నిధులను త్వరలో విడుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

గుడి చెరువు ప్రక్షాళన

గుడి చెరువులోకి వివిధ కాలువల ద్వారా వచ్చి చేరుతున్న మురుగు నీరు చేరకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నూతన కాలువ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నూతన మురుగు కాలువ నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధుల విడుదల చేయాలని, మురుగు నీటిని ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా శుద్ధి చేయాలన్నారు. ప్రస్తుతం గుడి చెరువు విస్తీర్ణం, పార్కింగ్ స్థల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అడగగానే నూతన మురుగు నీటి కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన, వీటీడీఏ సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఖనిజాలు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

- జిల్లాలో క్రషర్ల తనిఖీలు
- అక్రమార్కులకు రూ.2.23 లక్షల జరిమానాలు
- జిల్లా మైనింగ్ అధికారి రఘుబాబు



పోతిరెడ్డిపల్లెలో క్రషర్ తనిఖీ చేస్తున్న అధికారులు

సిరిసిల్ల: జిల్లాలో అనుమతి లేకుండా ఖనిజాలు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ అధికారి రఘుబాబు బుధవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మైనింగ్‌శాఖ ఆధ్వర్యంలో తనిఖీలను ముమ్మరం చేసినట్లు వివరించారు. వాహనదారులు విధిగా అనుమతి పత్రాలను వెంట ఉంచుకొని రవాణా చేయాలని, పత్రాలు లేకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో అనుమతి పత్రాలు లేకుండా ఖనిజాలను తరించే వాహనాలను గుర్తించి రూ.2.23 లక్షల జరిమానాలు వసూలు చేశామని రఘుబాబు వివరించారు. ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లెలో క్రషర్‌ను తనిఖీ చేసినట్లు వెల్లడించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి మైనింగ్ చేసినా రాయల్టీ చెల్లించకుండా తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 88.82 హెక్టార్లలో 25 కలర్ గ్రానైట్ లీజులు ఉన్నాయని, కంకర క్రషర్లు 74.44 ఎకరాల్లో 18 ఉన్నాయని వివరించారు. చట్ట విరుద్ధంగా ఎవరూ వ్యవహరించినా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సైదులు, సర్వేయర్ మంజుల, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జేఎల్‌ఎంలకు స్తంభం పరీక్ష

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 52 మందికి కాల్ లెటర్లు
- నేడు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు

కొత్తపల్లి(కరీంనగర్): క్షేత్రస్థాయిలో కరెంట్ సరఫరాలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడంతో పాటు మెరుగైన విద్యుత్‌ను వినియోగదారులకు సరఫరా చేయాలన్న లక్ష్యంతో జేఎల్‌ఎంల నియామకానికి విద్యుత్ సంస్థ శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలో తలెత్తే విద్యుత్ సమస్యలను వెనువెంటనే పరిష్కరించే సామర్థ్యం గల అభ్యర్థుల ఎంపికకు 2018 ఫిబ్రవరిలో టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ నోటిఫికేషన్ జారీ చేసింది. టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల పరిధిలో 2,553 జూనియర్ లైన్‌మెన్(జేఎల్‌ఎం) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ కావడంతో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 2018 ఏప్రిల్ 8న రాత పరీక్ష నిర్వహించారు. రాత పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులను రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ స్తంభం పరీక్షకు పిలిచారు. జేఎల్‌ఎం ఉద్యోగాల ఎంపికకు సర్కిల్‌ను యూనిట్‌గా తీసుకొని స్తంభం పరీక్షకు జాబితా తయారు చేశారు. ఈ జాబితాపై అభ్యర్థుల నుంచి వినతులు సమర్పించగా.. మరికొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ దరిమిలా న్యాయస్థానం ఆదేశాల మేరకు కొంతమందికి స్తంభం పరీక్షలు నిర్వహించారు. మూడు విడతలుగా జేఎల్‌ఎంల స్తంభం పరీక్ష పూర్తి కాగా.. నాల్గో విడతగా విద్యుత్ సంస్థ పరిధిలోని సర్కిళ్లలో 264 మంది అభ్యర్థులకు ఫిబ్రవరి 1న స్తంభం పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇందులో ఉమ్మడి కరీంనగర్ సర్కిల్ పరిధిలోని జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంనగర్ సర్కిళ్ల పరిధిలో 52 మంది జేఎల్‌ఎం అభ్యర్థులకు స్తంభం పరీక్ష నిర్వహించేందుకు కాల్ లెటర్లు పంపించారు. అయితే 52 మంది ఉత్తీర్ణత సాధిస్తారా.. లేదా అన్న విషయం తేలనుంది. ఇక ఇప్పటికే ఈ జేఎల్‌ఎం నియామక ప్రక్రియ ఐదేళ్లుగా కొనసాగుతోంది. 1:1 పద్ధతిలో ఈ నియామక ప్రక్రియ చేపట్టడం వల్ల నియామక ప్రక్రియ మరింత ఆలస్యం కానుందని పలు సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే ఈ నియామక ప్రక్రియ పూర్తి చేసి జేఎల్‌ఎంలకు పదోన్నతులు కల్పించి మరో నోటిఫికేషన్ వేయాల్సిన ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించి జేఎల్‌ఎంల నియామక ప్రక్రియ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



స్తంభం ఎక్కే పరీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఈ వి.గంగాధర్

సీజీఎం పర్యవేక్షణలో..

ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కేటాయించిన 52 జేఎల్‌ఎం పోస్టులకుగాను 1:1 పద్ధతిలో భర్తీ చేసేందుకు స్తంభం పరీక్ష గురువారం నిర్వహిస్తున్నారు. టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ సీజీఎం(హెచ్‌ఆర్డీ) ప్రభాకర్ పర్యవేక్షణలో కరీంనగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో అభ్యర్థుల స్తంభం పరీక్ష జరగనుంది. సీజీఎంతో పాటు కరీంనగర్ సర్కిల్ ఎస్‌ఈ గంగాధర్, సీనియర్ డీఈ, డీఈ(టెక్నికల్), విజిలెన్స్ పోలీస్‌స్టేషన్ నుంచి ఒకరు సభ్యుల సమక్షంలో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. స్తంభం ఎక్కే దృశ్యాలను వీడియోలో చిత్రీకరించి ఎంపిక చేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో స్తంభం పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్తంభాలు ఎక్కే క్రమంలో జారిపడ్డా ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉనక పొట్టును అందుబాటులో ఉంచారు. మెడికల్ క్యాంపు నిర్వహించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక పోలీసుల సహాయాన్ని కోరారు. స్తంభం ఎక్కే ప్రదేశాన్ని బుధవారం ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ పరిశీలించారు.

మెరిట్ అభ్యర్థులకు నష్టం

జేఎల్‌ఎంల నియామకంలో భాగంగా విద్యుత్ సంస్థ 1:1 నిష్పత్తిలో స్తంభం ఎక్కే పరీక్షకు పిలవడం వల్ల మెరిట్ అభ్యర్థులకు నష్టం జరుగుతోంది. రాత పరీక్షలో మెరిట్ సాధించి స్తంభం పరీక్షలో ఉత్తీర్ణత సాధించకపోతే ఆ అభ్యర్థికి నిరాశే ఎదురవుతోంది.

– ఇనుగాల శ్రీధర్, స్టేట్ సెక్రటరీ జనరల్, ఐఎన్‌టీయూసీ–327

పారదర్శకంగా పరీక్ష

టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు మూడో విడతగా ఉమ్మడి కరీంనగర్ సర్కిల్ పరిధిలో 52 జేఎల్‌ఎం అభ్యర్థులకు స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహిస్తున్నాం. వీడియో దృశ్యాలు, సీసీ కెమెరాల నిఘాలో ఈ స్తంభం పరీక్షలు పారదర్శకంగా జరగనున్నాయి.

– వడ్లకొండ గంగాధర్, ఎస్‌ఈ, కరీంనగర్ సర్కిల్

మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు

- జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి గంగయ్య



కలెక్టరేట్‌లో సమీక్షిస్తున్న అధికారులు

సిరిసిల్ల: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు అవకాశం ఉందని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి బొద్దుల గంగయ్య పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రీజినల్ స్థాయి కో–ఆర్డినేటర్, విజిలెన్స్ ఆఫీసర్లతో బుధవారం సమావేశమయ్యారు. గంగయ్య మాట్లాడుతూ 2024–2025 విద్యాసంవత్సరంలో 5 నుంచి ఇంటర్ ఎంపీసీ, బైపీసీల్లో ఫస్టియర్ వరకు ప్రవేశాలు ఉన్నట్లు తెలిపారు. మైనార్టీ జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రవేశాల గురించి ప్రచారం కల్పించాలని సూచించారు. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు చేరేలా చూడాలన్నారు. ఇంటర్మీడియట్‌లో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డెయిరీ టెక్నాలజీ వంటి వృత్తివిద్య కోర్సుల్లోనూ ఫస్టియర్‌లో ప్రవేశాలు పొందేందుకు అర్హత గల విద్యార్థులు ఫిబ్రవరి 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని కోరారు. ఓఎస్‌డీ సర్వర్‌మియా, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ షౌకత్ అలీ, అహ్మద్ అలీ, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఉరూస్ ఫాతిమా, రాజేశ్ పాల్గొన్నారు.

పూలే దంపతులను ఆదర్శంగా తీసుకోవాలి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మర్లపేటలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

బోయినపల్లి(చొప్పదండి): విద్యాభివృద్ధికి కృషిచేసిన పూలే దంపతులను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని మర్లపేటలో జ్యోతిరావు పూలే, సావిత్రిభాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించారు. మహిళల్లో ఎస్సీ, ఎస్టీ బీసీ అణగారిన వర్గాల ప్రజల్లో వెలుగులు నింపేందుకు పూలే దంపతులు చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. అంతకుముందు మాన్వాడలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించారు. కొదురుపాకలో దోబీఘాట్, హమాలీ, గౌడ, రజక సంఘ కమ్యూనిటీ హాళ్లు, జీపీ దుకాణాల సముదాయాలతో పాటు పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. జగ్గారావుపల్లిలో సైడ్ డ్రేన్ నిర్మాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వర్లపల్లి వేణుగోపాల్, జోగినిపల్లి వెంకట్రామారావు, సర్పంచులు జోగినిపల్లి శ్యామలాదేవి, సుకన్య, శ్రీనివాస్, సంది సౌందర్య, ఎంపీటీసీలు గౌతమి, ఐరెడ్డి గీత, కొంకటి శిరీష, సెస్ డైరెక్టర్ సుధాకర్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, బండి శ్రీనివాస్, శంకర్, రమణారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు గౌరవం కాపాడుకోవాలి




ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న దొమ్మాటి నర్సయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రజాప్రతినిధులు గౌరవాన్ని కాపాడుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో మంగళవారం జరిగిన మంత్రి సభలో స్థానిక జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని గ్రహించాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల అహంకారంతోనే ప్రజలకు దూరమయ్యారని, ప్రభుత్వాలు మారినా ఆ విషయాన్ని వారు తెలుసుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడినప్పటికీ స్థానికంగా జరిగే సమావేశాలకు ప్రతిపక్ష పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను సైతం ఆహ్వానిస్తున్న విషయాన్ని గ్రహించాలన్నారు. ఇప్పటికైనా హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, కార్యదర్శి లింగంగౌడ్, నాయకులు తిరుపతిగౌడ్, సత్తయ్య, రాంరెడ్డి, చెన్నిబాబు, ఎండీ రఫీ, కొత్తపల్లి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ శివారులోని సాయిబాబా గుడి వద్ద బుధవారం రాత్రి పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో వాహనదారులను తనిఖీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా బైక్‌లపై ప్రయాణించొద్దన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వసతి గృహాలు నిర్మించాలి



సిరిసిల్లటౌన్: రాష్ట్రవ్యాప్తంగా అన్నివర్గాల సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు పక్కా భవనాలు నిర్మించాలని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ కోరారు. బుధవారం సిరిసిల్లలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. నాయకులు మట్టి శ్రీనివాస్, నవీన్, సందీప్, నరేశ్, అరుణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు



గంభీరావుపేట/కోనరావుపేట: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని మినీస్టేడియంలో బుధవారం నిర్వహించిన సబ్ జూనియర్స్ పోటీల్లో పాల్గొన్న గంభీరావుపేట మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్–14లో చందన, లక్ష్మీసందీప్, రాంకిరణ్ ఎంపికయ్యారు. వీరిని పీఈటీ భాను అభినందించారు. కోనరావుపేట మండలం కనగర్తి ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థి బిక్కుమల్ల సహస్ర అండర్–10 విభాగంలో ఎంపికైంది. రాష్ట్రస్థాయికి ఎంపికైన సహస్రను హెచ్‌ఎం దేవదాస్, మధు, పీఈటీ అజయ్ అభినందించారు. వీరు ఫిబ్రవరి 10న కొత్తగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొననున్నారు.